

మద్యం టెండర్లకు వేళాయె..



- 2025-27 సంవత్సరాలకు లైసెన్సుల జారీకి అధికారుల కసరత్తు
- నవంబరు నెలాఖరు వరకు పాత లైసెన్స్ గడువు
- జిల్లాలో 71 వైన్‌షాపులు
- దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలకు పెంపు
- డిసెంబరు 1 నుంచి నూతన పాలసీ అమలు

జగిత్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2025-27 సంవత్సరానికి సంబంధించి మద్యం షాపుల టెండర్లకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. త్వరలో స్థానికఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రెండునెలల ముందే వైన్స్‌షాపుల టెండర్లకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ సిద్ధమైంది. తాజాగా కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు గెజిట్ విడుదలైంది. త్వరలో పూర్తి స్థాయిలో దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుతం ఉన్న వైన్ షాపులకు నవంబర్ 30వ తేదీ వరకు గడువు ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో రెండు నెలల ముందే వైన్ షాపుల టెండర్లకు ప్రభుత్వం సిద్ధమైందని తెలుస్తోంది. దీంతో జిల్లాలోని మద్యం వ్యాపారులు టెండర్లలో పాల్గొని మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి సమాయత్తమవుతున్నారు.

● పెరిగిన దరఖాస్తు రుసుము

జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. జగిత్యాల సర్కిల్ పరిధిలో 28దుకాణాలు, ధర్మపురి సర్కిల్ పరిధిలో 18, మెట్‌పల్లి పరిధిలో 25మద్యంషాపులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 71వైన్స్ దుకాణాలకు గానూ గౌడకులస్థులకు 14, ఎస్సీ సామాజిక వర్గానికి 8, జనరల్‌కు 49దుకాణాలను కేటాయించారు. 2019 సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 64దుకాణాలకు టెండర్లు నిర్వహించగా 1285 దరఖాస్తులు రగా ఎక్సైజ్‌శాఖకు రూ.25.70కోట్ల ఆదాయం లభించింది. 2023సంవత్సరంలో 71దుకాణాలకు టెండర్లు నిర్వహించగా 2,636 దరఖాస్తులు రాగా, ఎక్సైజ్‌శాఖకు రూ.52కోట్ల ఆదాయం లభించింది. జిల్లాలో సగటున నెలకు రూ.62కోట్ల విలువగల లిక్కర్ క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

యేడాదికి సుమారు రూ.751కోట్ల లిక్కర్ అమ్మకాల టర్నోవర్ ఉంటుందన్న అంచనాలున్నాయి. ప్రస్తుతం వైన్స్ దుకాణాల టెండర్లను నిర్వహించడానికి ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గీత వృత్తిపై ఆధారపడ్డ కుటుం బాలు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను వర్తింపచేశారు. టెండర్ల ప్రక్రియలో పాల్గొనడానికి ఒక్కో దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా వేసుకోవ డానికి వీలు కల్పించారు. అయితే ప్రతి దరఖాస్తుకు గతంలో రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.3లక్షలు(నాన్ రిఫండబుల్) చెల్లించాల్సి ఉంటుంది. కాగా ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లను ప్రకటించిన విషయం తెలిసిందే.

● రిటైల్ దుకాణాలకు ఎక్సైజ్ ట్యాక్స్...

జనాభా ప్రాతిపదికన లిక్కర్ దుకాణాలకు ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. 5వేల జనాభా కలిగిన గ్రామాలకు రూ.50లక్షలు, 5వేల నుంచి 50వేల వరకు రూ.55లక్షలు, 50వేల నుంచి లక్ష వరకు జనాభా కలిగిన గ్రామాలకు రూ.60 లక్షలు, లక్ష నుంచి అయిదు లక్షల వరకు రూ.65 లక్షలు, ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు రూ. 85 లక్షలు, 20 లక్షలకు పైగా జనాభా కలిగిన పట్టణాల్లో రూ. 1.10 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. సమాన వాయిదాలతో ఎక్సైజ్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మద్యం దుకాణాల అమ్మకాల సమయంలో 2023-25 లైసెన్స్ కాలంలో ఉన్న నిబంధనలు తిరిగి అమలు చేయనున్నారు. ప్రస్తుతం దుకాణాల లైసెన్స్ కాలపరిమితి నవంబరు..

- మిగతా 8లో

నేడు మంత్రి అడ్లూరి పర్యటన

ధర్మపురి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటిస్తారని మంత్రి పర్సనల్ అసిస్టెంట్ సంగి సాయి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నర్సయ్యపల్లె గ్రామంలో ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మండలంలోని నేరెళ్ల గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మండలంలోని గోవింద్‌పల్లె గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

-ఎస్పీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 27న ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై డీఎస్పీలు, సీఐలతో గురువారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ ఉత్సవాలు ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన విషయంలో నిర్వాహకులతో ముందుగానే సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. శాంతి భద్రతల సమస్య రానివ్వద్దని సమిష్టిగా పనిచేయాలన్నారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌ను ప్రత్యేక శ్రద్ధతో పరిగణించాలన్నారు. సీసీ టీవీలపై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండపాల్లో, శోభయాత్రలో డీజేల ఏర్పాటుకు అనుమతులు లేవని మండపాల నిర్వాహకులకు, కమిటీ అధికారులకు వివరించాలన్నారు. ప్రతి గణేష్ మండపం వద్ద పాయింట్ పుస్తకం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టులను ఫార్వర్డ్ చేస్తే క్రిమినల్ కేసుల తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీలు రఘు చందర్, రాములు, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ ఆరీఫ్‌అలీ ఖాన్, సీఐలు కరుణాకర్, అనీల్ కుమార్, సుధాకర్ ఉన్నారు.

విద్యార్థులు సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న అధికారులు

కొడిమ్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పంపిణీ చేసిన సైకిళ్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో స్వరూప సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను ఎంఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ సైకిల్‌ను తొక్కడం వలన ఏకాగ్రత, మానసికంగా ఆరోగ్యం ధృడంగా ఉంటుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి, కొడిమ్యాల గ్రామ మాజీ సర్పంచు ఏలేటి మమతనర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా నాయకు లు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, చల్ల శ్రీనివాసరెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సాయిబాబా, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, నాయకులు ఉన్నారు.

●మల్యాల: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తుండగా మండలంలో గురువారం తాటిపల్లి, బల్వంతాపూర్‌లో పంపిణీ ప్రారంభించారు. తాటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, మండల విద్యాదికారి జయసింహారావు, మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్యతో పాటు బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 247 మంది విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, బీజేపీ నాయకులు బింగి వేణు, గాజుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి



క్రీడాకారులకు మెడల్స్ అందజేస్తున్న అతిథులు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగష్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్ అన్నారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ జూనియర్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా స్పోర్ట్స్ అధికారి రవితో పాటు, ప్రముఖ పిల్లల వైద్యులు మోర సుమన్‌కుమార్ హాజరై, ఎంపిక పోటీలను ప్రారంభించారు. పోటీల అనంతరం మొదటి మూడు స్థానంలో నిలిచిన క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపుతో పాటు, శారీరక , మానసిక ధృడత్వం సిద్దిస్తుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచుకొని, జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బోగ రవి ప్రసాద్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ పోటీలలో అండర్ 14,16,18తో పాటు అండర్ 20 బాల బాలికలకు రన్నింగ్ 60మీ, 100మీ, 400మీ, 600మీ, 1500మీ, 3000మీ తో పాటు లాంగ్ జంప్, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్, విభాగాల్లో క్రీడలు నిర్వహించినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జగిత్యాల జిల్లా తరుపున ఎంపిక చేసి ఈ నెల 30, 31 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీలో జరిగే 11వ తెలంగాణ జూనియర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జగిత్యాల జిల్లా తరుపున విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని ముత్తయ్యరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎడ్లపురం అంజయ్య, కోశాధికారి కొమురయ్య, కార్తీక్, ప్రశాంత్, శంకర్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ హరిరామ్ కృష్ణ ప్రసాద్, పుష్పలత, వెంకటలక్ష్మీ, మధులిక, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం చేయాలని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి అందరు సహకరించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని నూకపల్లి అర్బన్ కాలనీలో గురువారం ఆసుపత్రి, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో రాజకీయాలు విడనాడి అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో నిర్మాణం నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయడానికి కావాల్సిన నిధుల కోసం ఎవరు ప్రయత్నం చేసినా తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద గల డంపింగ్ యార్డు చుట్టూ ప్రహారీ నిర్మిస్తామని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణానికి 203 కోట్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, జిల్లా విద్యాధికారి రాము, జిల్లా గృహ నిర్మాణాధికారి ప్రసాద్, జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేష్, మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్మన్ అడువాల జ్యోతి, లక్ష్మణ్, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

జగిత్యాల పట్టణంలోని లింగంపేట, ఉప్పరిపేటతో పాటు 13వ వార్డులో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం భూమి పూజ చేశారు. పట్టణంలో 70 లక్షల రూపాయల నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ కమిషనర్ స్పందన, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఈ వరుణ్, పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

సీఎం రేవంత్ రెడ్డి జగిత్యాల పట్టణాభివృద్ధికి మంజూరు చేసిన 50 కోట్లు మరియు విలీనం చేసిన ప్రాంతాలకు కేటాయించిన 20 కోట్ల రూపాయలతో జగిత్యాల పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ స్పందన, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఈలు వరుణ్, ఆనంద్ ఏఈలు శరణ్, అనిల్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు మరమ్మతులు

-ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఎండపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామంలో రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను అధికారులు సరి చేయించారు. వినాయక విగ్రహానికి తాగిన విద్యుత్ తీగలు అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. విగ్రహాలకు విద్యుత్ తీగలకు తాకకుండా పైకి లేపినట్లు ఏఈ కుండిమ సమ్మయ్య ఆంధ్రజ్యోతికి తెలిపాడు.

జేఎన్‌టీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కొడిమ్యాల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్లేస్‌మెంట్‌కు మేధా సర్వో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల హెడ్ కానిస్టేబుల్‌కు పదోన్నతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశ్రీ ఇటీవల ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రాజశ్రీ గురువారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏఎస్సైగా పదోన్నతి పొందిన రాజశ్రీకి స్టార్ చిహ్నాన్ని అలంకరించి ఎస్పీ అభినందనలు తెలియజేశారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న విద్యుత్ అధికారి మధుసూదన్

జగిత్యాల అగ్రికల్చర్, ఆగష్టు 21(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రమాద రహిత జిల్లాగా జగిత్యాలను మార్చేందుకు సిబ్బంది కృషి చేయాలని డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ మధుసూదన్, ఎస్ఈ సుదర్శనం అన్నారు. జిల్లాలోని విద్యుత్ ఇంజనీరింగ్, అకౌంట్స్ అధికారులతో స్థానిక పద్మనాయక మండపంలో జూలై నెలకు సంబంధించిన లక్ష్యాలు, వాటి పురోగాభివృద్ధిపై సెక్షన్ల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల ఇచ్చిన టార్గెట్‌లను వంద శాతం పూర్తి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ప్రసుత్తం గణపతి నవరాత్రులు వస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన చర్యలు, విగ్రహాల రవాణా, మండపాల నిర్వహణలో ఎలాంటి విద్యుత్ ప్రమాద ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఈ సమీక్షలో ఎస్ఏఓ, డీఈలు, ఏఓ, ఏడీఈలు, ఏఈలు, ఏఏఓలలు, సబ్ ఇంజనీయర్లు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



అశోక్, అధ్యక్షుడు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జగిత్యాల పట్టణానికి చెందిన డాక్టర్ ఒల్లాల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా ఫిజియోథెరపీ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఉపాధ్య క్షులుగా గుడ్ల లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అజరుద్దీన్, కోశాధికారిగా డాక్టర్ ఎండి యూకూబ్, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ పత్తిపాక గంగాధర్, ఉమ్మడి కార్యదర్శిగా డాక్టర్ హరీష్, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, శివకుమార్, ప్రశాంత్, సతీష్, అజీమ్, మల్లేష్, మైమూనా తబస్సుమ్, రమ్య, మనీషా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీదేవి

కొడిమ్యాల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇన్నోవేషన్ అండ్ స్టార్ట్ అప్ ప్రొఫెసర్ ఆర్.శ్రీదేవి అన్నారు. గురువారం కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఎన్‌టీయూ హెచ్ వైస్ చాన్సలర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రెక్టార్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న ఈ సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న 150మంది విద్యార్థులకు 15రోజుల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ప్రభుత్వం ఫండింగ్ స్కీంలు, నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నారన్నారు. ఈ సదస్సులో 10 బృందాలు అంకుర నూతన ఆలోచనలను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ శివాని, ఇంక్యుబేషన్ మేనేజర్ నవీన్‌కృష్ణ, స్టార్ట్ అప్ ఫౌండర్ సాజిత్, సమన్వయకర్త వంశీ పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళా

బుగ్గారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం ప్రాథమిక పాఠశాలలో గురువారం మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించడానికి బోధన ఉపకరణాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తహసీల్దార్‌తిరుపతి, ఎంపీడీవో అఫ్జల్‌మియా, ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయులు తయారుచేసిన ప్రతి టిఎల్‌ఎంను పరిశీలించి తరగతి గదిలో వాటిని ఎలా ఉపయోగిస్తారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మధుకర్ రావు, రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, సిఆర్‌పి పురుషోత్తం, ఎంఐఎస్ రాజేష్, సిసిఓ హరిత, ఐఈఆర్పి సమత, వివిధ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు సైబర్ నేరస్థుల అరెస్ట్

- నకిలీ బ్యాంకు ఖాతాలు సృష్టించి ట్రేడింగ్ పేరుతో రూ.74 లక్షలు మోసం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్

6

యూరియా కోసం తప్పని తిప్పలు

8

ద్విచక్రవాహనం కల్వర్టును ఢీకొని ఒకరి మృతి


తోట మల్లారెడ్డి(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తోట మల్లారెడ్డి(60) మృతి చెందాడు. రామడుగు మండలం వెంకట్రావుపల్లి నుంచి పెద్దపల్లి వైపు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎస్ఆర్ఎస్పీ ఉప కాలువ ఎల్ పైన నిర్మించిన కల్వర్టును ఢీకొని మల్లారెడ్డి కాలువలో పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటువైపు వెలుతున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుమారుడు రిషికేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కోతుల దాడిలో ఉపాధ్యాయుడికి గాయాలు

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కోతులు దాడి చేశాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులపై కోతులు దాడి చేయడానికి ప్రయత్నించాయి. గమనించిన ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ కర్రతో కోతులను అడ్డుకునేందుకు వెళ్లగా ఒక్కసారిగా ఆయనపై దాడి చేశాయి. దీంతో సంపత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇద్దరికి గాయాలు

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆటో నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరిని గాయపర్చిన ఆటో డ్రైవర్ నెల్లుట్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. బుధవారం రాత్రి తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి నాగరాజు నడుచుకుంటూ వెళ్తుండగా బద్దనపల్లి శివారులో ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో నాగరాజుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న నాగరాజు గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడ్డ వారు ఆటోడ్రైవర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోర్టులో హాజరు పరుచగా గురువారం వారికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి జరిమానా విధిస్తూ పెద్దపల్లి కోర్టు జడ్జి సునిత తీర్పు ఇచ్చినట్లు రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు. జూలై 2020లో ఇద్దరు వ్యక్తులు నిజామాబాద్‌లోని గుర్తు తెలియని వ్యక్తి నుంచి 2 కిలోల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ప్యాకెట్‌ను రూ. 150 నుంచి 200 వరకు బొంపల్లిలో విక్రయిండగా అప్పటి బసంత్‌నగర్ ఎస్ఐ జానీపాష వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరువురిపై నేరం రుజువు కావడంతో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, 5 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. నేరస్తులకు శిక్షపడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్, పోలీసు అధికారులు కీలక పాత్ర పోషించారు.


కరీంనగర్‌లో మండపానికి తరలుతున్న గణనాథుడు


విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహం

ఉత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకుందాం

వినాయకుల విగ్రహాల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గణేశ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులు వచ్చాయంటే అందరిలో ఉత్సాహం నెలకొంటుంది. రోజురోజుకు విగ్రహాల పరిమాణం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తరలింపులో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ యేడు విగ్రహాలు విద్యుత్ తీగలకు తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ శాఖ సిబ్బందికి, మండపాల నిర్వా హకులకు పలు సూచనలు చేశారు.

- విగ్రహాల ఎత్తుని బట్టి రూట్‌ని నిర్ణయించుకోవాలి. ఎక్కడైనా సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి
- విద్యుత్ లైన్లకు కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్ లో ప్రవహించే విద్యుత్ సరఫరా ప్రభావం, ఇండక్షన్ రెండు అడుగుల వరకు ఉంటుంది .
- ఎత్తైన విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలి
- మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకొరేషన్లను వీలైనంత వరకు తగ్గించాలి.
- మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కవద్దు. విద్యుత్ సిబ్బంది ద్వారానే కనెక్షన్ పొందాలి.
- ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలి. ఎలాంటి జాయింట్ వైర్లు వాడరాదు. తగినంత కెపాసిటీ కలిగిన ఎంసిబీ తప్పని సరిగా వాడాలి. ఇది విద్యుత్ ప్రమాదాల నుండి రక్షణ ఇస్తుంది.
- మండపాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు పరిసరాలను క్షుణ్ణంగా పరి శీలించాలి. విద్యుత్ వైర్లు, పోల్స్, ఇతర ప్రమాదకర విద్యుత్ పరికరాల నుండి పిల్లల్ని దూరంగా ఉంచాలి.
- ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే వారికి వెంటనే వైద్య సహాయం అందించి, ఆ ప్రమాదం గురించి దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- వైరింగ్‌లో ఎక్కడైనా లీకేజీ ఉంటే, వర్షాలు కురిసినప్పుడు తేమ వలన విద్యుదాఘాతం తగిలే అవకాశమున్నది. మండపాల నిర్వాహకులు ప్రతి రోజు తప్పని సరిగా వైరింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆర్టీసీ బస్సు కిందపడి ఇద్దరు విద్యార్థులకు గాయాలు


గాయపడ్డ అభిషేక్

మానకొండూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు కింద పడి ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని చెంజర్లకు చెందిన అశ్వికతేజ, అభిషేక్ పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో చదువుతున్నారు. గురువారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో పోచంపల్లి పాఠశాల వద్ద ఆదర్శ పాఠశాలకు కేటాయించిన బస్సులో ఎక్కుతుండగా అశ్వికతేజ, అభిషేక్‌లు బస్సు వెనుక టైర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. 108కు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై క్రాంతికుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన అమ్మిగల అనిల్ సెల్‌ఫోన్ 2023 మార్చి 3న బొమ్మకల్ గ్రామంలో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ లోకేషన్‌ను గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. బాధితుడు అనిల్‌కు గురువారం కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అప్పగించారు.

ఇల్లందకుంట : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఇల్లందకుంట మండలానికి చెందిన జక్కుల దేవేందర్ ఇటీవల తన మొబైల్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి ఎస్ఐ క్రాంతి కుమార్ బాధితుడికి తిరిగి అందజేశారు. ఈ మేరకు బాధితుడు దేవేందర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన ముగ్గురితోపాటు అనుమానాస్పదంగా తిరుగుతున్న మరో ముగ్గురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న గొల్లపల్లికి చెందిన కె.ఆంజనేయులు, కె.తిరుపతి, డి.సంపత్‌ను, బొమ్మకల్‌లో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరిగిన కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రమేష్, ఏసు, నాగరాజును గురువారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.74 లక్షల మోసం

- ముగ్గురు సైబర్ నేరస్థుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు పాల్పడుతున్న కర్ణాటకకు నాగేంద్ర ప్రసాద్, యోగేష్ కదం, సునీల్ అనే ముగ్గురు నేరస్థులను గురువారం సైబర్ క్రైం, జగిత్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం వివరాలను వెల్లడించారు. సైబర్ నేరస్థుల మాటలు నమ్మి జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల పట్టణాలకు చెందిన ఇద్దరు బాధితులు బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్‌లో విడతల వారీగా రూ.74 లక్షలు పెట్టి మోసపోయారు. అనంతరం బాధితులు జగిత్యాల సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శికా గోయల్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. దీంతో కోరుట్ల సీఐ సురేష్, బుగ్గారం ఎస్సై సతీష్, సైబర్ క్రైం ఎస్సైలు కృష్ణ, దినేష్ కుమార్‌లు స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. సైబర్ మోసానికి పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. నిందితులు కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లోని శ్రీనివాసపురంకు చెందిన నాగేంద్రప్రసాద్, ఉత్తర బెంగళూర్‌లోని దశరథాళికి చెందిన యోగేష్ కదం, నార్త్ బెంగళూర్‌లోని హెన్నూర్ క్రాస్‌కు చెందిన సునీల్‌లుగా గుర్తించారు. నిందితులు బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాలతో పాటు స్టాక్ మార్కెట్, బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాలను గుర్తించారు. ముగ్గురు నిందితులు కలకత్తాలో ఓ ముఠా ద్వారా ట్రాన్‌జాక్షన్ చేస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేశారు. ఇందులో నాగేంద్ర ప్రసాద్ సులువైన మార్గాల ద్వారా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో కలకత్తాలోని గ్యాంగ్ సభ్యులతో కలిసి ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్ లావాదేవీలు చేయించి ప్రజలను మోసగించి వచ్చిన డబ్బులను ఇతర ఖాతాలకు బదిలీ చేస్తున్నట్లు గుర్తించారు. సైబర్ నేరస్థుడు నాగేంద్ర ప్రసాద్‌పై దేశ వ్యాప్తంగా 71 కేసులు నమోదైనట్లు గుర్తించారు. మొబైల్‌తో పాటు బ్యాంక్ ఖాతాల పుస్తకాలు, చెక్ బుక్కులను జగిత్యాల జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే యోగేష్ కదం, సునీల్‌లు ఇతరుల పేర్లతో బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులను జల్సాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దేశ వ్యాప్తంగా యోగేష్ కదం, సునీల్‌పై 22 కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు.

వీధి కుక్కలను చంపుతున్నారని పోలీసులకు ఫిర్యాదు

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు వీధి కుక్కలను చంపుతున్నారంటూ స్ట్రే ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనే ఎన్‌జీఓ ప్రతినిధి ముదావత్ ప్రీతి బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దుర్గానగర్ వద్ద కొందరు వ్యక్తులు కుక్కలను ఒక వ్యాన్‌లో తరలిస్తున్నారని, అందులో రెండు కుక్కలు చనిపోయాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను ఓ మాజీ కార్పొరేటర్ అడ్డుకున్నాడని ఫిర్యాదులో తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేములవాడలో శిథిలాల తొలగింపు

- వేగవంతంగా రోడ్డు విస్తరణ పనులు


వేములవాడలో శిథిలాలను తొలగిస్తున్న యంత్రాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ. 47 కోట్లతో మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు గత రోడ్డును 80 ఫీట్లకు విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపుల 254 ఇండ్లను తొలగించేందుకు నిర్ణయించి నిర్వాసితులకు పరిహారం అందజేశారు. దీంతో గత రెండు నెలలుగా భవనాలను కూల్చివేసిన శిథిలాలు, మట్టి తొలగించకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల శిథిలాలను తొలగించేందుకు రూ. 22 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేపడుతున్నాడు. శిథిలాలు, మట్టిని వేగంగా తరలిస్తూ విస్తరణ పనులు చకచక నడుస్తున్నాయని పట్టణ వాసులు చెబుతున్నారు. వ్యర్థాల తొలగింపుతో రోడ్డు వెడల్పు కనిపించడంతో భక్తులు, పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మానేరు వద్ద జన సందడి


మానేరు వద్ద అహ్లాదంగా గడుపుతున్న జనం

గంభీరావుపేట, ఆగస్ట్ 21 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం వద్ద జనసందడితో కిటకిటలాడుతోంది. మానేరు ప్రాజెక్టు మత్తడి దూకుతుడటంతో సందర్శకులు వస్తున్నారు. ప్రాజెక్టు పరవళ్లను తిలకించేందుకు మానేరు పరిసరాలకు పర్యాటకులు ఉత్సహంగా విచ్చేస్తున్నారు. దీంతో మానేరు ప్రాంతం సందర్శకులతో సందడిగా మారింది.

నీటిసంపులో పడిన ఆవు

- రక్షించిన ఫైర్ సిబ్బంది


సంపులో పడిన ఆవు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని దోబివాడలో బుధవారం రాత్రి ఓ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో ఆవు ప్రమాదవ శాత్తు పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును రక్షించేందుకు ప్రయత్నించారు. సాధ్యంకాక పోవడంతో వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బందితో పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆవును రక్షించారు.

కారులో వచ్చి నగదు చోరీ

- బైక్ నుంచి రూ.1.9 లక్షలు దొంగిలించిన మహిళలు

జమ్మికుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు కారులో వచ్చిన ఇద్దరు మహిళలు కళ్లు మూసి తెరిచే లోపు ఓ ద్విచక్ర వాహనం నుంచి నగదు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరి శ్యామ్‌రెడ్డి తన భార్యతో పాటు ద్విచక్ర వాహనంపై జమ్మికుంట పట్టణానికి వచ్చాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1.9 లక్షల రూపాయలు విత్ డ్రా చేసుకుని తన ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి తన భార్యను ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కించాడు. అనంతరం పాత వ్యవసాయ మార్కెట్ దగ్గర ఉన్న నందిని కిరాణం ఎదుట ద్విచక్ర వాహనం పెట్టి లోనికి వెళ్లాడు. ఆ షాపులో కావల్సిన సామగ్రి లేక పోవడంతో పక్క షాపులోకి లోకి వెళ్లాడు. అందులో కావాల్సిన సామాగ్రి తీసుకున్నాడు.


సీసీ కెమెరాలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళలు

అప్పటికే నంబర్ ప్లేట్ లేని ఓ కారులో ఇద్దరు మహిళలు అతడిని అనుసరిస్తున్నారు. అదును చూసి ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో ఉన్న నగదును తీసుకోని ఏం తెలియనట్లు అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లి కారు వెనుకాల సీట్లలో కూర్చున్నారు. అప్పటికే స్టార్ట్ చేసి ఉన్న కారులో పరారయ్యారు. ఇదంతా తెలియని బాధితుడు తన ద్విచక్ర వాహనం వద్దకు వెళ్లి ముందు బ్యాగును పరిశీలించగా ఖాళీగా కనిపించింది. దీంతో కంగుతిన్న అతడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

చోరీ ఘటన సీసీ కెమెరాలో నమోదైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన ట్రాఫిక్ ఎస్సై


గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ హరిశేఖర్

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లో గురువారం పెద్దపల్లి నుంచి మంచిర్యాల వైపునకు వెళుతున్న రన్నింగ్ ఆటో నుంచి ఒక వ్యక్తి జారి కిందపడ్డాడు. అతనికి తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్ అతన్ని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మానవతా దృక్పథంతో క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ హరి శేఖర్‌ను ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ రాజేశ్వర్‌రావు అభినందించారు.

బీర్‌పూర్ పెద్దగుట్టపై వరదపాశం

- పెద్దగుట్టలో లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బీర్‌పూర్,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలకేంద్రం శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ సమీపంలోని పెద్దగుట్టపై వెలసిన స్వామి వారికి గురువారం వరదపాసం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దగుట్టపై వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం బీర్‌పూర్ గ్రామంలోని నాయకులు, రైతులు, అర్చకులు, ఆయా గ్రామాల ప్రజలు గ్రామ శివారులోని పెద్దగుట్ట వద్దకు కాలినడకన చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దగుట్ట ఆలయ చరిత్రను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా వరద పాసం నిర్వహనకు, అన్నదానం కార్యక్రమాలకు పలువురు దాతలు తమ వంతుగా ఆర్థిక సహాయ హకారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు పెద్ద సంతోష్ కుమార్, మధు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


బీర్‌పూర్ పెద్ద గుట్టపై వరద పాశం పోస్తున్న అర్చకులు

జాతీయస్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని షిరిడీలో ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శ్రీపాల్‌రెడ్డి, కొరిమి సంతోష్‌కుమార్, పెద్దపల్లి జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సంపత్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 15 సంవత్సరాల విభాగంలో ఆర్ .విష్ణువర్ధన్, ఎ.లక్షిత్ రాజ్, బి.హర్షవర్ధన్, 17 సంవత్సరాల విభాగంలో కె.అరవింద్, ఈ.శ్రీధర్, టి.రిత్విక్, టి.అవినాష్, జి.సుజిత్ కుమార్, పెద్దపల్లి జిల్లా నుంచి 15 సంవ త్సరాలు విభాగంలో ఇ.అవినాష్ రావు, అండర్-17 విభాగంలో విశ్వనాథ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, మహ్మద్ కరీం, ప్రైవేట్ పీఈటీ బాధ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గౌతమ్ హర్షం వ్యక్తం చేశారు.


ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ..

కోనరావుపేట: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మండల విద్యార్థి ఎంపికైనట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామానికి చెందిన లకావత్ ఆరాధ్య ఎస్ఏటిజి అకాడమీ విద్యార్థి ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్ 15 క్రీడల్లో ప్రతిభ కనపరచగా జాతీయస్థాయి క్రీడకి ఎంపికైనట్టు తెలిపారు. పూణేలో ఈ నెల 25న జరగనున్న వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్టు తెలిపారు.


ఆరాధ్య


సాయిచరణ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగు సాయిచరణ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో పదవతరగతి చదువుతున్న సాయిచరణ్ సిరిసిల్లలో గురువారం జరిగిన పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఎంపికయ్యాడు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నాడు.

రాజన్న ఆలయంలో వృద్ధుడి అస్వస్థత

● ఆసుపత్రికి తరలించిన ఆలయ ఉద్యోగులు



వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ ఉద్యోగులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఓ భక్తుడు అస్వస్థతకు గురయ్యాడు. రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వస్తున్న వృద్ధుడు హఠాత్తుగా ఒక్కసారిగా అస్వస్థతకు గరయ్యాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు.

ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

● అర్హులకు అందడం లేదని పలువురి ఆందోళన

తంగళ్లపల్లి, ఆగష్టు 21 (ఆంధ్రజ్యోతి):మైనార్టీ ముస్లిం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లు పంపిణీ కోసం గతంలో దరఖాస్తులు స్వీకరించగా గురువారం మైనార్టీ శాఖ అధికారులు అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో మైనార్టీ పాఠశాల అవరణలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తుండగా అర్హులైన తమకు ఎందుకు ఇవ్వడం లేదని కొంత మంది మహిళలు అధికారులను నిలదీశారు. ఏడాది క్రితం దరఖాస్తులు చేసుకున్నామన్నారు. మిషన్ తీసుకోవడానికి రావాలని మైనార్టీ కార్యలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. పంపిణీ కేంద్రం దగ్గరికి వస్తే అర్హుల జాబితాలో పేరు లేదని చెప్తున్నారన్నారు. అర్హుల జాబితాలో పేరు లేకుంటే మమ్మల్ని ఎందుకు రమ్మన్నారని అధికారుల తీరుపై మహిళలు మండి పడ్డారు. అర్హులైన తమకు కూడా కుట్టు మిషన్లు అందించాలని డిమాండ్ చేశారు. విషమయంపై వివరణ కోసం మైనార్టీ అధికారులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా స్పందించలేదు.



PM YASASVI Scholarship 2025

యశస్వీ భవ



ఓబీసీ, ఈబీసీ విద్యార్థులకు పీఎం యశస్వీ స్కాలర్‌షిప్‌లు

● ఉన్నత విద్య కోసం రూ. రెండు లక్షల వరకు ఉపకార వేతనం

● దరఖాస్తుకు ఈ నెల 27 వరకు గడువు



చొప్పదండి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం యశస్వీ పథకాన్ని తీసుకువచ్చింది. ఉన్నత విద్య అభ్యసించలేని ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ అందించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ ద్వారా ఈ స్కాలర్‌షిప్‌లను అందజేయనుంది. స్వయం ప్రతిపత్తి, ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు లభించనున్నాయి. హాస్టల్ వసతి ఖర్చుల కోసం ప్రతి నెల మూడు వేల రూపాయల వరకు చెల్లించనున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికిగాను పీఎం యశస్వీ పథకం కింద విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

● **నవంబరు వరకు స్కాలర్‌షిప్‌లు మంజూరు**

పీఎం యశస్వీ(పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీం ఫర్ వైబ్రెంట్ ఇండియా) పథకం కింద టాప్‌క్లాస్ విద్యాసంస్థల ఫీజులు, హాస్టల్ ఫీజులను విద్యార్థులకు అందజేస్తారు. ఎన్ఐటీ, ఐఐటీ, నిఫ్ట్, ఐఐఐటీ, ఇష్లాతోపాటు ఇతర టాప్‌క్లాస్ విద్యాసంస్థలలో చేరే విద్యార్థులకు గరిష్ఠంగా రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రెండు లక్షలలోపు ఉండాల్సి ఉంది. ఈ పథకం కింద రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలకు 400కుపైగా స్లాట్‌లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. స్లాట్లు, దరఖాస్తుల ఆధారంగా నవంబర్ వరకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయనున్నారు. దీనికి ఎలాంటి అర్హత పరీక్ష లేదు. స్కాలర్‌షిప్‌లలో 30 శాతం బాలికలకు కేటాయిస్తారు.

● **దరఖాస్తు ప్రక్రియ ఇలా...**

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఎన్ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్), ఎన్‌టీఏ, scholarships.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. తర్వాత విద్యార్థికి ఒక ఐడీని కేటాయిస్తారు. ఆ ఐడీ ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థి స్కాలర్‌షిప్ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 27 చివరి తేదీకాగా, చేసుకున్న దరఖాస్తుల్లో లోపాలను సవరించుకునేందుకు సెప్టెంబరు 15 వరకు అవకాశం కల్పించారు.

వైభవంగా సామూహిక లక్ష బిల్వార్చన



పూజా కార్యక్రమంలో భక్తులు

ఓదెల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం అర్చకులు వీరభద్రయ్య ఆధ్వర్యంలో సామూహిక లక్ష బిల్వర్చన వైభవంగా నిర్వహించారు. యేటా నిర్వహించే మాదిరిగా లోక సంరక్షణార్థమై 180మంది దంపతులతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. శ్రావణమాసం విశిష్టత, బిల్వార్చన ప్రాధాన్యతను ఈ సందర్భంగా అర్చకుడు భక్తులకు వివరించారు. బిల్వార్చనతోపాటు ఏకాదశ రుద్రాభిషేకం, సహిత రుద్రాహవణం, మంగళహారతి మంత్రపుష్పం నిర్వహించారు. గర్భగుడిలో కొలువుదీరిన శేషాలింగేశ్వరునికి భక్తులు బిల్వపత్రిని సమర్పించారు. గోదావరిఖనికి చెందిన కన్నూరి రాజమల్లు,సుగుణ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై డీఎల్పీవో విచారణ

శంకరపట్నం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలో ఇంటి నిర్మాణంపై హుజూరాబాద్ డీఎల్పీవో శ్రీనివాస్ గురువారం విచారణ చేపట్టారు. కరీంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో వనపర్తి అయిలయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తుండగా గ్రామపంచాయతీ స్థలం ఆక్రమించాడని వనపర్తి హరీష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హుజూరాబాద్ డీఎల్పీవో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు హరీష్‌తో పాటు గృహ నిర్మాణం చేపడుతున్న వనపర్తి అయిలయ్య వాంగ్మూలాలు తీసుకున్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని డీఎల్పీవో శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట ఎంపీవో ప్రభాకర్ ఉన్నారు.

24న జనహిత పాదయాత్ర

- ఉప్పరమల్యాల నుంచి గంగాధర వరకు..
- 25న ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం,
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్న ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మక్కాన్ సింగ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల గ్రామం నుంచి కురిక్యాల చౌరస్తా మీదుగా గంగాధర వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్ర ఈనెల 24న నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం డీసీసీ కార్యాలయంలో మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు, అనుబంధ సంఘాలకు, పార్టీ అభిమానులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. యాత్రను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమన్వయ పరుస్తారన్నారు. 24వ తేది సాయంత్రం పాదయాత్ర తరువాత గంగాధరలో బస ఉంటుందన్నారు. 25వ తేది ఉదయం ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ పాల్గొంటారని తెలిపారు. మహిళా సంఘాలతో మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. అనంతరం జిల్లా ముఖ్య కార్యకర్తలతో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ ఇష్టాగోష్టి నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 24న సాయంత్రం 4 గంటలకు గంగాధర మం డలంలో జనహిత పాదయాత్ర ఉంటుం దన్నారు. ఈ పాదయాత్రలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలంతా పాల్గొంటారన్నారు.

● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు భరోసా ఇస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుని సక్షేమాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమావేశంలో ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఆకుల నర్సన్న, రాజిరెడ్డి, పులి అంజనేయులు, శ్రావణ్‌రాయక్, దన్నా సింగ్, బోనాల శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కవ్వంపల్లికి మంత్రి పొన్నం పరామర్శ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం బుధవారం అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం కరీంనగర్‌లో పరామర్శించారు. కవ్వంపల్లి రాజేశం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యే కవ్వంపల్లితో మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● మాస శివరాత్రి సందర్భంగా మహాలింగార్చన



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రద్దీ కొనసాగుతోంది. గురువారం ఉదయం ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకొని పరివారం దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు.

మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు

శ్రీరాజరాజేశ్వర స్వామివారికి మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం 5.30గంటల నుంచి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. స్వామివారికి కల్యాణ మండపంలో రుద్రహవనం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 6.05 గంటలకు అద్దాల మండపంలో మహాలింగార్చన నిర్వహించగా, ఆలయ ఈవో రాధాబాయితో పాటు భక్తులు హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కులధ్రువీకరణ పత్రంలో నో కరెక్షన్

● ఆప్షన్ లేకపోవడంతో అయోమయం

ధర్మారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రంలో కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో బాధితులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో మీ సేవలో కమ్యూనిటీ అండ్ డేట్ ఆఫ్ బర్త్ పేరుతో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారు. క్యాస్ట్ సర్టిఫికెట్‌లో కులంతోపాటు పుట్టిన తేదీ వివరాలు ఉన్నా రెవెన్యూ అధికారులు కేవలం కులం సర్టిఫికెట్‌ను మాత్రమే మంజూరు చేసేవారు. దాదాపు నెల రోజుల క్రితం కుల ధ్రువీకరణ పత్రం విషయంలో డేట్ ఆఫ్ బర్త్ ఆప్షన్ తీసివేసి కేవలం కమ్యూనిటీ సర్టిఫికెట్ అని వచ్చేలా ప్రభుత్వం అప్‌డేట్ చేసింది. ఈ అప్‌డేట్ విద్యార్థులకు శాపంగా మారింది.

ఉదాహరణకు ఒక వ్యక్తి కులం సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోగా అతను ఇంతకు ముందు ఎన్ని సార్లు కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నారో దానికి సంబంధించిన పూర్తి వివరాలు చూపిస్తుంది. అందులో నుంచి చివరగా తీసుకున్న సర్టిఫికెట్‌ను మాత్రమే అతను రీ ప్రింట్ తీసుకోవచ్చు కాని కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వీలులేదు. ఇంతకు ముందు కుల ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకోని వారు అప్లై చేసుకుంటే దరఖాస్తు తీసుకునేలా వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారు.

కొందరికి మేలు..

గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తరచూ ఆఫీసు చుట్టూ తిరగకుండా వచ్చిన పాత డేటానుంచే సులభంగా కుల ధ్రువీకరణ పత్రం పొందుతున్నారు. అయితే గతంలో జారీచేసిన కులం సర్టిఫికెట్స్‌లో తప్పులు దొర్లినవారికి కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో నానాతంటాలు పడుతున్నారు. ఇలాంటివారికి కొత్తగా దరఖాస్తుకు, కరెక్షన్‌కు అవకాశంలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు, కాలేజీ స్టూడెంట్స్, స్కాలర్‌షిప్‌కోసం అవ సరమున్న వారు, కల్యాణలక్ష్మి దరఖాస్తు చేసుకునేవారు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. అధికారులు కమ్యూనిటీ సర్టిఫికెట్‌కు కరెక్షన్‌ఆప్షన్ కల్పించాలని కోరుతున్నారు.



కుల సర్టిఫికెట్‌లో తప్పు సరిదిద్దాలని కోరుతున్న బాధితుడు

ఏం చేయాలో అర్థం కావడం లేదు..

\- నునావత్ అరుణ్ నాయక్, (లంబడితండా బి గ్రామం)

నా పేరు నునావత్ అరుణ్ నాయక్, మాది లంబడితండా బి గ్రామం. నేను ఆర్మీకి సెలెక్ట్ అయ్యాను. నాకు వచ్చే నెలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంది. ఇంతకు ముందు తీసిన కులం సర్టిఫికెట్‌లో నాపేరు అరుణ్ నాయక్‌కు బదులు అరుణ్ అని పడింది. కొత్తగా కులం సర్టిఫికెట్‌కు మీ సేవకు వెలితే పాత సర్టిఫికెట్ వస్తుంది. పాత సర్టిఫికెట్‌ను కరెక్షన్ ఆప్షన్ లేదు అంటున్నారు. దీంతో ఏం చేయాలో నాకు అర్థం కావడం లేదు. సంబంధిత అధికారులే నాకు న్యాయం చేయాలి.

ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

జగిత్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 1,39,255 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 75.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 49.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలు వలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 29,532 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 651 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మూడు, నాలుగు రోజులుగా భారీగా వరద వస్తుండడంతో గేట్లు ఎత్తి దిగువ గోదావరికి నీటిని విడుదల చేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఈనెల న ఉదయం 6 గంటల నుంచి గేట్లు మూసి వేశారు.

● **ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద**

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం ప్రాజెక్టు నుంచి 3,600 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ నుంచి 26,000, వాగులు, వంకల నుంచి 47500 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నందున గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 15 గేట్లు ఎత్తి లక్ష 16వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 19.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది..

● మంథనిరూరల్: మండలంలోని సిరిపురం సమీపంలోని సుందిళ్ల బ్యారేజీలో వరదగురువారం సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టింది. బ్యారేజీ నుంచి 26 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారు.

● **గాయత్రి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల**

రామడుగు: రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు.

● బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నీటితో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రం వరకు 18,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. వరద కాలువ ద్వారా 14,800, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 3,150, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.17 ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 15.97 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

● **అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు**

ఇల్లంతకుంట: మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు ఉంది. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టుకు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● **ఎగువ మానేరు పరవళ్లు**

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరవళ్లు కొనసాగుతున్నాయి. పల్వంచ, కూడవెళ్లి వాగుల నుంచి వరద నీరు వస్తుండడంతో జలాశయం మత్తడి దూకుతోంది. మానేరు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 2202 క్యూసెక్కులుగా కొనసాగుతోంది.

మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు

● ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ● ఎల్లారెడ్డిపేటలో ఉత్సాహంగా తీజ్



తీజ్ వేడుకల్లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్, అధికారంలో గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడంతో పాటు త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు దక్కే అవకాశాలున్నాయని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ అన్నారు. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా తీజ్ వేడుక నిలుస్తోందన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గిరిజనులు గురువారం తీజ్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు ఎల్లారెడ్డిపేట మీదుగా వెళ్తున్న ఆయన స్థానికంగా జరిగిన తీజ్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంతో కలిసి పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. గిరిజన యువతులు, మహిళలతో కలిసి సందడి చేశారు. గోధుమ నారు బుట్టలను ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రకృతిని ఆరాధించే పండుగ తీజ్ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, గిరిజన నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

కొడిమ్యాల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెప్యాల, అప్పారావుపేట గ్రామాలకు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ గౌడ్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్‌రెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టుతున్న పనుల జాతర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వారు తెలిపారు.

ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

కొడిమ్యాల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వం భూమలు ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని బుధవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు, ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణకు గురయిన భూములను రికవరీ చేసి, ప్రభుత్వ భూముల వివరాలు గ్రామ పంచాయతీ కార్యాలయాలలో, తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై అతికించు విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కొడిమ్యాల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మహాత్మా జ్యోతి బాపులే కరీంనగర్ వ్యవసాయ బాలికల కళాశాల విద్యార్థినిలు గ్రామీణ బాగస్వామ్య విశ్లేషణ సదస్సులో బాగంగా కృషి అనుభవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం శివారులోని వైకుంఠ దామం, అటవీ భూముల్లో వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ బాలయ్య కళాశాల విద్యార్థినిలు శృతి, దీప్తి, హరిణి, శ్రావణి, స్నేహలత, ప్రణీత పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడవద్దు

కొడిమ్యాల, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడవద్దని ప్రిన్సిపాల్ కె. వేణు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ కార్యదర్శి ఆదేశాలతో హెల్ప్ కార్యక్రమంలో బాగంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తురహిత సమాజం ఏర్పాటుకు విద్యార్థులు ముందుండాలన్నారు. స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ తిరుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా చిన్న అంజయ్య

కొడిమ్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముదిరాజు1 సంఘం అధ్యక్షునిగా బల్ల చిన్న అంజయ్యను సభ్యులు గురువారం ఎన్నుకున్నారు. ప్రచార కార్యదర్శిగా చొక్కాల అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా చొక్కాల రాజేశం, చొక్కాల రాజమల్లు, బైరిసూరి, చొక్కాల నాగార్జునను ఎన్నుకున్నాట్లు సభ్యులు తెలిపారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

-క్యూలైన్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్‌లు


క్యూలైన్‌లో పాస్ పుస్తకాల జిరాక్స్‌లు పెట్టి పడిగాపులు కాస్తున్న రైతులు

రాయికల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి యూరియా కోసం రైతులు సొసైటీల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అరకొరగా వస్తున్న యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. రాయికల్ మండలం భూపతిపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి గురువారం ఉదయం యూరియా లోడ్ వస్తుందన్న విషయం తెలుసుకున్న ఆ సహకార సంఘ పరిధిలోని రైతులు ఉదయం 5 గంటల నుంచే యూరియా కోసం పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్‌లను క్యూలైన్‌లో పెట్టి యూరియా కోసం వేచి ఉన్నారు. వచ్చిన లోడ్‌లో 300 యూరియా బస్తాలు మాత్రమే రావడంతో క్యూలైన్ ప్రకారం అందజేశారు. అవి కూడా ఒక్కో ఎకరానికి ఒక్క యూరియా బస్తా మాత్రమే అధికారులు అందజేశారు. యూరియా దొరక్క చాలా మంది రైతులకు నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయమై సీఈవో శేఖర్‌ను వివరణ కోరగా కొంత మంది రైతులకు మాత్రమే యూరియా బస్తాలు అందలేదని, అందనివారికి శుక్రవారం ఇవ్వనున్నట్లు తెలిపారు.

యూరియా కోసం ఆందోళన

కోరుట్ల రూరల్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం గురువారం మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన రైతులు కోరుట్ల-రాయికల్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతుల బాధలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. అవసరం ఉన్నత యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, గ్రామ రైతులు జగన్ రావు, భూమా గౌడ్, సోమిశెట్టి నడిపి మల్లయ్య, పెద్ద మల్లయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్ ఇసుక రీచ్‌ను రద్దు చేయాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆత్మకూర్ గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని వాగులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను గ్రామస్థుల తరఫున కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. మంగళవారం కలెక్టర్‌కు కోరుట్ల ఎమ్మెల్యే రాసిన లేఖను మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డితో పాటు గ్రామస్థులు అడిషనల్ కలెక్టర్ బిఎస్ లతకు అందజేసి సమస్యను వివరించారు. ఎమ్మెల్యే లేఖ ద్వారా గ్రామంలోని ప్రజా విచారణ, పర్యావరణ అనుమతి లేకుండా గుర్తించిన రీచ్ నుంచి రవాణా చేయడం వలన గ్రామస్థులు ఏకగ్రీవంగా వ్యతిరేకి స్తున్నారు. వాగులో నుంచి ఇసుకను రవాణా చేయడంతో ఉధృతంగా మారుతోందని, ప్రజల జీవన విధానం, భద్రత, పర్యావరణం అన్నీ ముప్పుకు గురవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ నష్టమే కాకుండా ఏకగ్రీవంగా గ్రామస్థుల నిరసనలతో భద్రతా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. చట్టపరమైన ప్రక్రియలు పూర్తి అయ్యే వరకు, పాదర్శకంగా ప్రజా విచారణ జరిపి, పర్యావరణ అనుమతులు వచ్చేంత వరకు ఇసుక రవాణాలను నిలిపివేయాలని లేఖ ద్వారా కోరినట్లు గ్రామస్థులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, చౌటుపల్లి అంజయ్య, గ్రామస్థులు ఉన్నారు.

'ఢిల్లీ సీఎంపై దాడి గర్హనీయం'

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం రేఖాగుప్తాపై జరిగిన దాడి గర్హనీయం అని భారత్ సురక్షా సమితి నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న సమయంలో ఓ అగంతకుడు వచ్చి దాడి చేయడాన్ని తమ సంఘ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు మతిస్థిమితం లేని కారణంగానే ఇలా జరిగిందని నిందితున్ని వెనకేసుకొని వచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేవలం ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని అస్థిర పరచడానికి కొందరు ఇలాంటి చర్యలు చేస్తున్నారనే అనుమానం కలుగుతుందన్నారు. వెంటనే దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భారత్ సురక్షా సమితి నాయకులు ఏసీఎస్ రాజు, కాశీనాథం, చిట్ల గంగాధర్, వెంకట్‌రెడ్డి, దేవరాజం, బాలన్న, భూమన్న, గంగాధర్, వీరన్న తదితరులున్నారు.

క్రీడామైదానం ఏర్పాటు చేయాలి

జగిత్యాలరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామయూత్ సభ్యులు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ను కలిసి చల్‌గల్ గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. క్రీడామైదానం ఏర్పాటు చేయడం వల్ల పరిసరప్రాంతాల ప్రజలకు ఉపయోకరంగా ఉంటుందని, విద్యార్థులు క్రీడల్లో రాణించుటకు దోహదపడుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి క్రీడామైదానం ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో చల్‌గల్ యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మహా లింగార్చన


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా లింగార్చన కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్థానిక వేదపండితులు రుద్ర నమకం, చమకం, మన్య సూక్తం, లక్ష్మీ సూక్తం, పురుష సూక్తంతో మహా లింగార్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్ర పుష్పం, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, స్థానిక వేదపండితులు మదు శంకర్‌శర్మ, తాడూరి బలరాంశర్మ, జనుమంచి రాములుశర్మ, కొరిడె శంకర్‌శర్మ, పెండ్యాల చంద్రశేఖర్ శర్మ, పెండ్యాల బాలకృష్ణశర్మ, కళొజ్జల చిరంజీవిశర్మ, పెండ్యాల మహేందర్‌శర్మ, కాసర్ల వెంకటరమణశర్మ, అర్చకులు ద్యావళ్ల సాయికుమార్, ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు వేళాయె..

(ఐదో పేజీ తరువాయి)

30వ తేదీ వరకు ఉంది. కొత్త పాలసీలో ఒక్కో షాపునకు టెండర్ ఫీజు రూ.3 లక్షలకు పెంచడంతో వ్యాపారులు కొంతమేర నిరుత్సాహం వ్యక్తమవుతోంది. నూతన మద్యం పాలసీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయగా ఇందుకు సంబంధించిన షెడ్యూల్ రావాల్సి ఉంది.

●డ్రా పద్ధతిలో దుకాణాల రిజర్వేషన్ల కేటాయింపు

జిల్లాలో గౌడ, ఎస్సీ, ఎస్టీలతో పాటు జనరల్ కేటగిరీలో దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన రిజర్వేషన్లకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో ఖరారు చేయనున్నారు. సంబంధిత దుకాణాలకు సదరు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు మాత్రమే దరఖాస్తులను అందించాల్సి ఉంటుంది. జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో వైన్స్ దుకాణాలను కేటగిరీల వారీగా కేటాయించాల్సి ఉంటుంది. ఈ మేరకు రిజర్వేషన్ల జాబితాను ప్రభుత్వానికి పంపించిన వెంటనే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి టెండర్ ప్రక్రియ షురూ చేయడానికి ఎక్సైజ్ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల కోసం ఆశావహులు భారీగా పోటీ పడే అవకాశం ఉంది.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే..

-సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు నిర్వహిస్తాం. పారదర్శకంగా టెండర్ల నిర్వహణ పూర్తి చేయడానికి అవసరమైన కసరత్తులు చేస్తున్నాం. గతంలో కంటే దరఖాస్తుదారుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఉన్నతాధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయిస్తాం.

ఎన్‌సీసీతో దేశభక్తి అలవడుతుంది

జగిత్యాల అగ్రికల్చర్, ఆగష్టు 21(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి అలవడుతుందని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. కళాశాలలో ఎన్‌సిసి ఎన్‌రోల్‌మెంట్‌లో భాగంగా 9వ బెటాలియన్ ఆర్మీ అధికారులు హవల్దార్‌లు రాకేష్, పీవీ రావు కళాశాలకు చేరుకొని, కళాశాలలో చదువుతున్న ప్రథమ సంవత్సరం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక అనంతరం ప్రిన్సిపాల్ అశోక్ , హవల్దార్ రాకేష్ లు మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ భావన పెంపొందుతుందన్నారు. ఈ సర్టిఫికెట్ ద్వారా త్రివిధ దళాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు, రక్షణ రంగం, యూనిఫాం విభాగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. అందువల్ల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశ భద్రతలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ పర్లపల్లి రాజు, వైస్ ప్రిన్సిపాల్ ఆడె శ్రీనివాస్, డాక్టర్ సాయి మధుకర్, అంకం గోవర్ధన్ తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న రమేష్ ఈనెల 15న ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ సత్యప్రసాద్, మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా గురువారం తహసీల్దార్ కార్యాల యంలో రమేష్‌ను మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, మాజీ జడ్పీటీసీ కొక్కు పురుషోత్తం, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళా

బీర్‌పూర్,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీర్‌పూర్ తహసీల్దార్ సుజాత ప్రారంభించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. పరికరాలతో విద్యా బోధనను ఎలా అందించాలో అనే అంశాలపై టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా అవగాహన కల్పించారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శనలో పెట్టి సందర్శకులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల స్థాయి అధికారులు మేళలో ప్రదర్శనకు పెట్టిన ప్రతి మెటిరియల్‌ను పరిశీలించి బెస్టు టీ ఎల్ ఎం లను సెలెక్టు చేసి సర్టిఫికెట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, ఎంపీడీ భీమేష్, ఆర్‌ఐ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహమూర్తి, సుదర్శన్, ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను తాకిన వినాయక విగ్రహం

-స్థానికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


చింతలపేట రహదారిపై విగ్రహానికి తాకిన విద్యుత్ తీగలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోరుట్లల్లో గురువారం కొనుగోలు చేసిన వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మెట్‌పల్లి మండలంలోని చింతలపేట జాతీయక రహదారిపైన గల విద్యుత్ తీగలను తాకింది. స్థానికులు గమనించి తీగలను కట్టే సహాయంతో తొలగించడంతో పెను ప్రమాదం తప్పింది.

విగ్రహాల తరలింపులో జాగ్రత్త వహించాలి

-విద్యుత్ ఏడీఈ మనోహర్

వినాయక విగ్రహాల తరలింపులో జాగ్రత్త వహించాలి. విద్యుత్ మూడు రకాల లైన్లతో కూడిన నెట్‌వర్క్ ఉంటుంది. 33 కేవీ, 11 కేవీ, ఎల్టీ లైన్లు ఉంటాయి. కర్రలతో ఎత్తే ప్రయత్నిస్తే 33 కేవి, 11 కేవి లైన్లతో తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి, దీపాలు మండపంలోని వైర్లకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

గణేశ్ మండపాలకు సౌకర్యాలు కల్పించండి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాలకు మొరం పోసి చదును చేయించాలని జగిత్యాల విశ్వహిందూ పరిషత్ నాయకులు జగిత్యాల మున్సిపల్ కమీషనర్ స్పందనకు వినతిపత్రం అందించారు. మొరం పోయించడంతో పాటు పట్టణంలోని ప్రతి మండపం వద్ద సానిటరీ సదుపాయాలు కల్పించాలని కోరారు. విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్ నగర శాఖ అధ్యక్షులు జిట్టవేణి అరుణ్ కుమార్, కార్యదర్శి ఎదురుగట్ల పరందాం, గాజోజు సంతోష్ కుమార్, ప్రజ్యోత్ బిట్టు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ము జమ

మల్లాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడుతగా డబ్బులు ఖాతాలోకి నిధులు జమయ్యాయని ఇందిరమ్మ ఇళ్ల కమిటీ నాయకుడు షైపాల్‌రెడ్డి అన్నారు. నడికుడ గ్రామంలో 16 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అందులో 11 మంది మొదటి విడుతగా ఇండ్ల నిర్మాణాలు మొదలు పెట్టారన్నారు. దీనిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు కోరిపల్లి సుమలత మొదటి విడుతగా రూ. లక్ష ఖాతలో జమయైనట్లు తెలిపారు.

బ్రిడ్జిని తనిఖీ చేసిన ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు యామాపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న తాత్కాలిక రోడ్డు వరద కారణంగా కొట్టుకొనిపోయింది. ఎంపీడీవో మహమ్మద్ సలీం, ఆర్‌అండ్‌బీ ఏఈ ఫైజాన్‌తో కలిసి గురువారం అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని సందర్శించారు. వీలైనంత తొందరగా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయించడం కొరకు సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి పనిని పూర్తి చేయించాలని సూచించారు.

ఉపాధి పనుల జాతరను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వెల్గటూర్ ఎంపీడీవో కృపాకర్

కోరుట్ల రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల జాతరను విజయవంతం చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ మండల, గ్రామ స్థాయి అధికారులకు సూచాంచారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ. 1.34 కోట్లతో నిర్వహించనున్న పనుల వివరాలను వివరించారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం మంజూరి అయిన పనులను ఈ నెల 22 నుండి ప్రారంభించాలని సూచించారు. ఈ పనుల జాతరలో అంగన్‌వాడి భవనాలు, ఇందిరా మహిళ శక్తి ఉపాధి భరోసా క్రింద పశువుల కోట్టాలు, కోళ్ల, గోర్ల షేడ్, పండ్ల తోటలు వానపాముల తయారి, డ్రైనేజ్, ఇంకుడు గుంతలు, కమ్యూనిటి, శానిటరీ కాంప్లెక్ వంటి పనులు ఉన్నాయని వాటిని నిర్వహించడాని గ్రామ సభలె నిర్వహించి గ్రామస్థులకు వివరించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు హరిత సంరక్షకులకు సన్మానించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ మమత, ఫీల్డ్ అసిస్టెంట్లు దారసింగ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●పెగడపల్లి: పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పనుల జాతర 2025 పై ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త పనులను ఏక కాలంలో ప్రారంభించడానికి గాను శుక్రవారం పనుల జాతర 2025ను చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి,రవీందర్, హౌసింగ్ పి.డి ప్రసాద్, ఏఈ జలీల్, శ్రీమాన్, ఏపీవో అనీల్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాదిహామీ ఉద్యోగలు పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం జరిగే పనుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎంపీడీఓ మహమ్మద్ సలీం పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను తొందరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈపిఆర్ అభినవ్, ఏపీఓ కొమురయ్య టి ఏ లు గంగాధర్ వినోద్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

●వెల్గటూర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం మంజూరైన పనులపై నేడు అన్ని గ్రామాలలో నిర్వహించనున్న ఉపాధి పనుల జాతరను విజయవంతం చేయాలని ఎంపీడీవో కృపాకర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల జాతర అంశంపై వెల్గటూర్,ఎండపల్లి మండలాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు 210 పనులకు గాను పనుల ప్రారంభోత్సవాలు, భూమి పూజ చేయాలని సూచించారు.

ఆయా గ్రామాలలో గ్రామ సభ నిర్వహించి వ్యక్తిగత మంజూరు పత్రాలు అందజేయాలని అన్నారు. గ్రామాలలో మంచిగా పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను, దివ్యాంగులను, హరిత సంరక్షకులను సన్మానించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కుమార్ ,హౌసింగ్ ఏఈ గౌతమి, ఏపీవో అనిల్, ఈసీ, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు హెల్త్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి అన్నారు. అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా న్యాయవాదులకు జారిచేయబడ్డ హెల్త్ కార్డులను న్యాయవాదులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి హెల్త్ కార్డులను రెండు లక్షల వరకు మెడి క్లైయిమ్ చేసుకోవచ్చని, 10 లక్షల వరకు యాక్సిడెంట్ కవరేజి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తోగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్,జాయింట్ సెక్రటరీ గజేల్లి రామ్‌దాస్, ట్రెజరర్ పడిగేలా శ్రీనివాస్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు గండ్ర ప్రవీణ్ రావు, ఏలేటి రామ్ రెడ్డి, బోడ లక్ష్మణ్, పుప్పాల రామ్ భూపాల్, దయ్యాల రాజారాం, కట్టా నర్సాగౌడ్, యండి రజాక్, పసునూరి సుదర్శన్, రాంపల్లి జగన్, మ్యాన నరహరి,తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతవరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని మెట్‌పల్లి డిఎస్పీ ఎ రాములు అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పట్టణ, మండలాలకు చెందిన వినాయక మండప నిర్వహకులతో, వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తి శ్రద్దలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. వినాయకుడిని ప్రతిష్టించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెద్ద పెద్ద విగ్రహాలను తరలించేటప్పుడు విద్యుత్ వైర్లను గమణించి తీసుకెళ్లాలని తెలిపారు. వినాయ నిమజ్జనం సంప్రదయ పద్ధతిలో చేయాలని డిజేల పెట్టి ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సిఐ అనిల్, ఎస్‌ఐ కిరణ్‌కుమార్, వినాయక మండప నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

●కథలాపూర్: గణపతి నవరాత్రోత్స వాలు ప్రశాంత వాతావరణంలో నిబంధనలు పాటిస్తూ నిర్వహించుకోవాలని ఎస్సై నవీన్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామాల గణేశ్ మండలి మండప నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వినోద్, ఎంపీడీఓ శంకర్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి ఉన్నారు.

●మల్లాపూర్: ప్రజలు భక్తి శ్రద్ధలతో సాంప్రదాయంగా గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని మల్లాపూర్ తహసీల్దార్ రమేష్, ఎస్సై రాజులు సూచించారు. గురువారం ఆయా గ్రామాల గణేష్, మండపాల నిర్వహకులకు మల్లాపూర్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వినాయక విగ్రహాల తరలింపు, నిమజ్జనంలలో విద్యుత్ తీగలను చూసుకోవాలని ఎలాంటి ప్రమాదకర సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలు అంశాలను నిర్వహకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికుమార్, ట్రాన్స్‌కో అధికారులు, వినాయక మంటపాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పెగడపల్లి మండలంలో మంత్రి అడ్లూరి పర్యటన

పెగడపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటించనున్నట్లు మార్కెట్ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ తెలిపారు. మండలంలోని లింగాపూర్‌లో పల్లె దవఖాన బిల్డింగ్, అంగన్‌వాడీ కేంద్రం భవననిర్మాణ పనుల శంఖుస్థాపనతో పాటు అయిత్‌పల్లిలో నూతనంగా నిర్మించిన పల్లెదవాఖాన భవనాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాములుగౌడ్ కోరారు.

మట్టి విగ్రహాలను పూజించాలి

జగిత్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహాలను పూజించాలని జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ సూచించారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ హితమైన మట్టి వినాయకులను అందంగా తీర్చిదిద్దారు. ఇందుకు ప్రోత్సహించిన ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు సంగీత, శ్రీలత, మరియు సుజాతలను అభినందించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామానికి ఇబ్రహీంపట్నం మీదుగా బస్సుసౌకర్యం కల్పించాలని కోరుతూ మెట్‌పల్లి డిపో మేనేజర్‌కు కోమటి కొండాపూర్ యోగేశ్వర గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు గురువారం మెటపల్లి డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు బక్కూరి రాధ,ఎడ్ల లక్ష్మీ, ప్రియాంక పాల్గొన్నారు.

ఇసుక డంపులకు వేలం

ఎండపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక డంపులను గురువారం తహశీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో పదకొండు మంది పాల్గొన్నారు. పదిహేను ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు 45 వేలు ఆదాయం రెవెన్యూ కార్యాలయానికి సమకూరింది.